సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 29 । జనవరి । 2025



వేసవికి సన్నద్ధం కావాలి

వేసవిలో విద్యుత్ సమస్యలు నివారించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు.

- 8లో▸



...విఘాతం కలిగిస్తే చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

31⁰/18⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

భద్రకాళికి అందెశ్రీ పూజలు



హన్మకొండ కల్చరల్ : వరంగల్‌లోని భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి




విద్యారణ్యపురి : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి కోరారు. జిల్లాలో ఎంపిక చేసిన 75 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం డీఈఓ కార్యాలయంలోని డీసీఈబీ భవనంలో ఒకరోజు శిక్షణలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అండ్ ఐఐటీ గాంధీనగర్ సౌజన్యంతో రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ కిట్స్‌ను ఆయా ఉపాధ్యాయులకు అందజేశారు. ఈసందర్భంగా వాసంతి మాట్లాడుతూ అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు వినూత్నంగా జాయ్‌ఫుల్ లెర్నింగ్ పేరుతో రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ కిట్స్‌ను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు స్టాక్ రిజిస్టర్‌ను నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేయాలని సూచించారు. శిక్షణలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు వేణుగోపాలస్వామి, మహేందర్ పాల్గొన్నారు.

30న జాతీయ సదస్సు


కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 30న సెనేట్ హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సహకారంతో రీసెంట్ అడ్వాన్స్ ఇన్‌ఫార్మస్యూటికల్ సైన్సెస్–2025 అనే అంశంపై ఈ జాతీయ సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా సదస్సు పోస్టర్‌ను మంగళవారం వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్, డీన్ గాదె సమ్మయ్య, బీఓఎస్ చైర్ పర్సన్ జె.కృష్ణవేణి, వై.నర్సింహారెడ్డి, డాక్టర్ షాయెదా, స్వరూపరాణి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



మడికొండ : విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదువుకోవాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ముందస్తు ప్రణాళికపై ఆయన అవగాహన కల్పించారు. మానసిక నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి మానసిక సమస్యలకు లోనుకావొద్దని, సలహాలు, సూచనలు పొందేందుకు 14416 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడిపికొండ వైద్యాధికారి శ్రీదేవి, సంతోష్, హెల్త్ అసిస్టెంట్ వెంకటస్వామి, కుమారి, లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సహస్ర



వరంగల్ స్పోర్ట్స్ : హరియాణాలోని పంచకులలో వచ్చేనెల 2వ తేదీ నుంచి జరగనున్న పాఠశాల క్రీడల సమాఖ్య జాతీయస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టులో హనుమకొండ డీఎస్ఏ క్రీడాకారిణి సహస్రకు చోటు దక్కింది. సహస్ర మూడేళ్లుగా జేఎన్ఎస్‌లో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ మహ్మద్ అఫ్జల్ వద్ద శిక్షణ పొందుతోంది. జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సహస్ర, కోచ్ అఫ్జల్‌ను మంగళవారం హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రు నాయక్, జిమ్నాస్టిక్ కోచ్ నరేందర్ అభినందించారు.



జన గళమా.. జగడమా..!

అటకెక్కిన కీలక సమస్యలు

- అధ్వానంగా విభాగాల పనితీరు
- పట్టించుకోని పాలకులు
- నేడు గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం

ఎవరి వాదనలు వారివే..

బల్దియా పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, కీలక విభాగాల అధికారులు, సిబ్బంది తమ మాటలు లెక్క చేయడం లేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలు, ఖాళీ స్థలాలు శుభ్రం చేయడం లేదని, కుక్కలు, కోతులు, పందులు, దోమల సమస్యలను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని అంటున్నారు. అభివృద్ధి పనుల విషయంలో ఇంజనీర్లు తమ ఇష్టానుసారంగా పాలకవర్గ పెద్దల ఆదేశాలే శిరోధార్యంగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల డివిజన్‌కు రూ. 60లక్షల నిధులు కేటాయించి రాత్రికి రాత్రే పనులు చేస్తున్నారని, అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శిస్తున్నారు. బాగున్న రోడ్ల మీద మళ్లీ రోడ్లు, డ్రెయినేజీలను కూల్చివేసి కొత్తగా నాణ్యతాప్రమాణాలను పాటించకుండా నిర్మిస్తుండటం వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుందని అంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని, అనుమతి లేని భవనాలు కోకొల్లలుగా వెలుస్తున్నాయని తద్వారా బల్దియా ఆదాయానికి గండి పడుతుందని పేర్కొంటున్నారు. కొత్త ఇంటినంబర్లు, పేరు మార్పిడి, ఆస్తుల విభజన, వీఎల్‌టీల పేరుతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దోపిడీ చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో కార్పొరేటర్లు తమ పదవులకు గౌరవం ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. ఇకపోతే బల్దియాలోని కీలక విభాగం అధికారులు, సిబ్బంది వాదనలు మరోవిధంగా ఉన్నాయి. ప్రజల సమస్యలను తాము వీలైనంత మేరకు పరిష్కారిస్తున్నామని, ఏదో ఒకలా తమను మచ్చిక చేసుకోవాలని పనులు, సంక్షేమ పథకాల కోసం ఒత్తిళ్లు పెరుగుతున్నాయని వారు అంటున్నారు. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశాలు ఐదేళ్లుగా భిన్నంగా కొనసాగుతున్నాయి. పాలక వర్గం, ఉన్నతాధికారులు ఎజెండాలో తమకు నచ్చిన అంశాలను చేర్చుకొని ఆమోదించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షాలు ప్రస్తావించేందుకు అవకాశం లేకుండా పోయిందని, ఒకవేళ కల్పించుకుని ప్రశ్నలు సంధిస్తే దాటవేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మీడియాకు అనుమతి నిరాకరిస్తుండడంతో సర్వసభ్య సమావేశాలు రహస్య సమావేశాలుగా మార్చేస్తూ, ముగిస్తున్నారనే అపఖ్యాతిని మూటగట్టుకుంటున్నారు. కౌన్సిల్ తీర్మానాలు అవినీతికి ఊతమిచ్చేలా ఉన్నాయంటూ ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. నేడు (బుధవారం) ఉదయం 11:30గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షాలు కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎవరికి వారు సమావేశమయ్యారు. ప్రజా సమస్యలను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతుండగా, తిప్పికొట్టేందుకే అధికార పక్షం సన్నద్ధమైనట్లు సమాచారం. కౌన్సిల్ సమావేశంలో చర్చా, రచ్చ అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఖరీదైన స్థలాలు పెద్దల పరం

- మూడు చోట్ల పీపీపీపై అప్పగింతకు నిర్ణయం
- పాలక వర్గం నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

అవి నగర నడిబొడ్డున అత్యంత ఖరీదైన బల్దియా స్థలాలు. ఇక.. ప్రైవేట్ పరం కానున్నాయి. ఈ స్థలాలపై కన్నేసిన పెద్దలు ఎలాగైనా తమ సొంతం చేసుకునేందుకు పాలకవర్గంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తూ బుధవారం జరగనున్న కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆమోదించే విధంగా విశ్వప్రయత్నాలు చేస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2005లో వైఎస్సార్ శంకుస్థాపన..

హనుమకొండ అశోకా థియేటర్‌కు ఎదురుగా బల్దియా పాత మున్సిపల్ స్థలం ఉంది. ఇక్కడ మల్టీలెవల్ కాంప్లెక్స్, పబ్లిక్ గార్డెన్‌కు సమీపంలోని గెస్ట్‌హౌస్ స్థలంలో బడ్జెట్ హోటల్ నిర్మాణానికి 2005లో రాజీవ్ నగర బాటలో భాగంగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 75 శాతం, ఏపీయూఎఫ్ఐడీసీ ద్వారా 25శాతం నిధులను సమకూర్చి భవనాలు నిర్మించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ప్రయత్నం ఫలించలేదు. పలుమార్లు రూపొందించిన డీపీఆర్‌లో ఆమోదయోగ్యం కాలేదు. 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రెండు విలువైన స్థలాలతోపాటు నక్కలగుట్టలో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, వార్డు కార్యాలయ స్థలాన్ని కలుపుకొని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో దక్కించుకునేందుకు కొంతమంది ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. విలువైన స్థ లాలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తుండటంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రీవెన్స్ సెల్ సమస్యలపై చొరవ కరువు

క్షేత్రస్థాయిలో సమస్యలపై అటు కార్పొరేటర్లు, ఇటు సిబ్బందికి ఫిర్యాదులు చేస్తున్నా పట్టింపు లేకపోవడంతో ప్రజలు పెద్దఎత్తున ప్రతీ సోమవారం గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. చేద్దాం..చూద్దాం అనే సమాధానాలు తప్ప క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు గ్రీవెన్స్‌సెల్‌లో నిలదీతలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సిటిజన్ చార్టర్ అమలు కావడం లేదని, గ్రీవెన్స్ ఫిర్యాదులపై సమీక్షించే వారే కరువయ్యారనే విమర్శలున్నాయి. ఇలా బల్దియాలో పరిపాలన గాడి తప్పిందని, అవినీతి మితిమీరిపోయిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో బల్దియా సమావేశంలో నగరజనం సమస్యలపై గళమెత్తుతారా.. లేక జగడానికి ప్రాధాన్యమిస్తారా అన్నది చూడాలి.

తూర్పు అభివృద్ధే ధ్యేయం



రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్ : తూర్పు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన ధ్యేయమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ 41, 32 డివిజన్లలో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వేర్వేరుగా చేపట్టిన అభివృద్ధి పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడారు. సమస్యలు లేని డివిజన్లుగా మార్చడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పద్మ, గుండు చందన, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, కర్ర కుమార్, పోశాల స్వామి, మంతిని సునీత పాల్గొన్నారు.

సాకరాశికుంట నాలా పరిశీలన

కరీమాబాద్ రోడ్డు సాకరాశికుంట నాలాను మంత్రి సురేఖ పరిశీలించారు. నాలా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా సర్వే నిర్వహించాలని, భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జంతువులను దత్తత తీసుకున్న మంత్రి కొండా సురేఖ

న్యూశాయంపేట : వన్యప్రాణుల సంరక్షణపై మక్కువతో మంత్రి కొండా సురేఖ వరంగల్ కాకతీయ జూపార్క్‌లోని నాలుగు జంతువులను మంగళవారం దత్తత తీసుకున్నారు. వీటిలో నిల్గాయ్, సాంబార్‌డీర్, చౌసింగా, అడవి దున్నను ఏడాదిపాటు మంత్రి దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్యప్రాణుల రక్షణకు జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. వరంగల్ జూపార్క్‌ను, హైదరాబాద్ జూపార్క్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. జంతువుల నిర్వహణ ఖర్చులకు రూ.2లక్షలు జూపార్క్‌కు చెల్లించారు. ఎఫ్ఆర్ఓ మయూరి ఉన్నారు.

కొత్తవాడలోని పేరుకుపోయిన స్టాక్‌ను కొనుగోలు చేయాలి

కొత్తవాడ సంఘాల్లో పేరుకపోయిన స్టాక్‌ను చూడాలని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు మంత్రి కొండా సురేఖను కోరారు. దీంతో ఆమెవెంటనే కాశీ విశ్వేశ్వర చేనేత సహకార సంఘంలో పేరుకున్న స్టాక్‌ను చూసి చలించిపోయారు. అనంతరం చేనేత శాఖ ఎండీ శైలజారామయ్యర్‌కు ఫోన్ చేసి వరంగల్‌లోని కొత్తవాడ సంఘాల్లో నిల్వ ఉన్న 2లక్షల బెడ్ షీట్స్‌ను కొనుగోలు చేసి కార్మికులకు పని కల్పించాలని ఆదేశించారు. స్పందించిన మంత్రికి కార్మికులు దర్రీస్‌తో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ కావటి కవితాయాదవ్ తదితరులు ఉన్నారు.

కుష్ఠుపై అవగాహన కల్పించాలి

వరంగల్ డీఎంహెచ్ఓ సాంబశివరావు

ఎంజీఎం: కుష్ఠు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు వైద్యాధికారులకు సూచించారు. స్పర్శ్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ (ఎస్ఎల్ఏసీ) కార్యక్రమంపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. లెప్రసీ వ్యాధి మైక్రో బాక్టీరియాలెప్రీ అనే సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పాదాలు, చేతివేళ్లు తిమ్మిర్లు వంటి లక్షణాలను వ్యాధిగ్రస్తులు కలిగి ఉంటాయని తెలిపారు. అనంతరం కుష్ఠు నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మోహన్‌సింగ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

త్వరలో 'సూపర్ స్పెషాలిటీ' ప్రారంభం

- ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సీఎం నిర్ణయం
- వేగంగా ఆస్పత్రి నిర్మాణ పనులు
- 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్ : వరంగల్ జిల్లా అభివృద్ధిపై పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రామచంద్రునాయక్, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డితోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వరంగల్ మహానగరంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరలో ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రాంపూర్–మడికొండ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలని వారు కోరారు. గ్రేటర్ వరంగల్ నగరానికి మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ డీపీఆర్ తయారు చేసి త్వరితగతిన పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యేలు.. సీఎంను కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఫోన్‌లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 31న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడానికి సీఎం నిర్ణయం తీసుకున్నారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం

ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాజీపేట బస్టాండ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య తదితరులు

కాజీపేట రూరల్ : కాజీపేట ప్రజల చిరకాల స్వప్నమైన బస్టాండ్ నిర్మాణానికి అధికారికంగా స్థలం కేటాయించగానే శంకుస్థాపన చేయనున్నారు. ఏప్రిల్‌లో ఫాతిమానగర్ బ్రిడ్జి ప్రారంభంతోపాటు కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీఓ రమేశ్ రాథోడ్, సికింద్రాబాద్ రైల్వే ఏడీఆర్ఎం గోపాల్, తహసీల్దార్ బావుసింగ్ ఇతర విభాగాల అధికారులతో కలిసి కాజీపేట జంక్షన్ ఎదుట కలియతిరిగారు. నిరుపయోగంగా ఉన్న రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడే బస్టాండ్ స్థలాన్ని నిర్ణయించారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాజీపేట బస్టాండ్ ఏర్పాటు కోసం చాలాసార్లు రైల్వే జీఎంను కలిసి విన్నవించగా ఇటీవల ఆయన స్పందించారని చెప్పారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌ను రెండో రాజధానిగా చేసేందుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీలో సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కాజీపేట వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద కాజీపేట జంక్షన్ అభివృద్ధి జరుగుతుందని వివరించారు. అనంతరం బస్టాండ్ రూట్‌మ్యాప్ స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మావతి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీరజాలీ, కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్, భట్టి శ్రీనివాస్, అబుబకర్, గుంటి కుమార్, రజాలీ, అజ్గర్, ఎస్.రవి, అంజనేయులు, సంతోష్, బాబురావు, రహ్మతుల్లా, గుంటి స్వప్న, మానస, సుకన్య, సమత, మేరి పాల్గొన్నారు.

భద్రకాళి పూడిక తరలింపు టెండర్ రద్దు

- రూ.9.51 కోట్ల పనులకు ముందుకురాని కాంట్రాక్టర్‌లు
- పూడిక తీత, లోడింగ్‌కు మాత్రం రెండు దరఖాస్తులు..
- తక్కువ కోట్ చేసిన వారికి నేడు ఖరారు



భద్రకాళి చెరువులోని మట్టి

సాక్షిప్రతినిధి, వరంగల్ : భద్రకాళి చెరువునుంచి పూడిక మట్టి తరలింపు టెండర్‌ను నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం రద్దు చేశారు. రూ.9.51 కోట్లతో పనులు అప్పగించేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చెరువులో రూ.3.49 కోట్ల విలువైన పూడిక తవ్వడం, లోడింగ్ పనిని ఖరారు చేయనున్న ఇరిగేషన్ అధికారులు.. మట్టి తరలింపు టెండర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. పూడికతీత అనేది కీలకంగా మారడంతో ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.

'భద్రకాళి' పూడికతీతకు బాలారిష్టాలు...

వరంగల్ మహా నగరపాలక సంస్థ సుమారు 50 సంవత్సరాల తర్వాత ఓరుగల్లు భద్రకాళి చెరువు పూడికతీతపై దృష్టి సారించింది. ఇందుకోసం నీరంతా ఖాళీ చేశారు. అంతకుముందే పూడికతీత పనుల కోసం పంపించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.13,00,09,046తో రెండు పనులకు నీటిపారుదలశాఖ ఈ నెల 5, 10 తేదీలలో టెండర్లు పిలిచింది. ఇందులో ఒక పని చెరువులో పూడిక తవ్వడం, లోడింగ్ కోసం క్యూబిక్ మీటర్‌కు రూ.53 చొప్పున రూ.3,49,11,446లు కేటాయించారు. అదే విధంగా క్యూబిక్ మీటరుకు రూ.162.56ల చొప్పున 5.85 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని తరలించేందుకు రూ.9,50,97,600లు చెల్లించేలా మరో పనికి టెండర్ పిలిచారు. మట్టి తవ్వకం, లోడింగ్ పని కంటే, పూడిక మట్టి తరలించే పనికి సంబంధించి ఈ నెల 17వ తేదీ నాటికి కాంట్రాక్టర్లు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఈ మేరకు పూడికతీత, లోడింగ్, తరలింపు పనులను అత్యవసరంగా భావించిన అధికారులు రెండోసారి 27వ తేదీ గడువుతో టెండర్లు పిలిచారు. మంగళవారం టెండర్లు తెరిచిన అధికారులకు ఆన్‌లైన్‌లో ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. దీంతో ఈ టెండర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు.

రూ.3.49 కోట్ల పనులపై నేడు నిర్ణయం...

భద్రకాళి చెరువులో పూడిక తవ్వడం, లోడింగ్ కోసం రూ.3,49,11,446ల పనులకు అధికారులు బుధవారం టెండర్లు ఖరారు చేయనున్నారు. ఈ పని కోసం ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్ షెడ్యూల్ దాఖలు చేశారు. శ్వేత, జీఎస్ ఇన్‌ఫ్రా అనే సంస్థల దరఖాస్తులను పరిశీలించిన పిదప.. తక్కువ రేటు కోట్ చేసిన వారికి పనులు అప్పగించనున్నారు. పూడిక మట్టిని తరలించే పనులకు ఎవరూ ముందుకు రానందున.. అంతకుముందే చేపట్టే పూడిక తవ్వకం, లోడింగ్ పనులు ఖరారు చేసే విషయంలో కొంత తాత్సారం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా.. భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు పనుల టెండర్ నిబంధనల సడలింపు, కాంట్రాక్టర్లకు వెసులుబాటు కల్పించే అంశమై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇరిగేషన్ అధికారులు.. ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకొనే నిర్ణయాలకు అనుగుణంగా మరోసారి టెండర్లు పిలిచే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం.

ప్రీప్రైమరీ అమలు చేయాలి




మురళికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశీబుగ్గ సెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ విద్యను అమలు చేయాలని పీఆర్టీయూటీ బాధ్యులు కోరారు. ఎన్ఈపీ–2020 అమలు, గుణాత్మక విద్యలో భాగంగా పీఆర్టీయూటీ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత, బాధ్యులు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఏడు కిలోమీటర్ల మేరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్‌లో నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓవర్ లోడ్, డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో జనవరి 26న వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా నో షాపింగ్.. నో పార్కింగ్ బోర్డులతోపాటు ప్రమాద సూచికల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీ దివ్య పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికాభివృద్ధి

వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంతో పారిశ్రామికంగా వరంగల్ ఎంతో అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుంటూరుపల్లి రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు కనెక్టివిటీ కావాలని రైతులు కోరగా.. ఈవిషయంపై పరిశీలించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరావును ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌కు 44 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మక ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 సెంటర్లలో కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 1,243మంది అభ్యర్థులకు 1,208మంది హాజరుకాగా 35మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌ను మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించగా అందులో1,133 మంది అభ్యర్థులకు 1,124 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 44మంది గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు.

ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన వారిలో యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ బీసీఎం రాజు, యూనివర్సిటీ న్యాయ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆర్. స్వరూపరాణి ఉన్నారు. వీరికి వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు.

కొనసాగుతున్న శిక్షణ..

కాకతీయ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎన్‌సీసీ జవాన్‌ల శిక్షణ కార్యక్రమంలో కొనసాగుతోంది. మంగళవారం ఈ శిక్షణలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పాల్గొని 'ఆటోమేషన్ టాక్స్ విత్ మ్యాక్రోస్' అనే అంశంపై విస్తృతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి రమ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బీఫార్మసీ విద్యార్థిని మృతి

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్‌లోని వాగ్దేవి బీఫార్మసీ కళాశాలలో చదువుతున్న సాయి చంద్రిక ఫ్యాన్‌కు ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీశ్ తెలిపారు. కరీంనగర్‌జిల్లా హుజూరాబాద్‌కు చెందిన బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న సాయి చంద్రిక (20) ఈనెల 26న హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకోగా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఈనెల 27న మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా చనిపోయినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని తండ్రి రామ్‌టెక్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రంబుల్ స్ట్రిప్స్‌తోనూ 'ప్రమాదమే'?

మామూనూరు ఘటనాస్థలి వద్ద పరిమితికి మించి మందం

- 7.5 మి.మీలు ఉండాల్సి ఉండగా 30 మి.మీల వరకు ఏర్పాటు
- ఫలితంగా స్పీడ్ బ్రేకర్ల మాదిరి ఉండడంతో ప్రమాదాలు
- ఆటోలు, కార్ల వేగం పూర్తిగా తగ్గడంతో వరుస ఘటనలు
- భారీ వాహనాల వేగం అదుపు తప్పడంతోనే ప్రమాదాలు
- ఐఆర్‌ఎస్ నిబంధనలు పాటించాలంటున్న వాహనదారులు



రోడ్డు ప్రమాద స్థలం వద్ద పరిమితికి మించి మందంతో ఉన్న రంబుల్ స్ట్రిప్స్

సాక్షి, వరంగల్ : మామూనూరు వద్ద ఆదివారం ఉదయం 11.20 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణం ట్రేలర్ ట్రక్కు డ్రైవర్ డ్రంకెన్ డ్రైవ్ ఓ కారణం కాగా...ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ (ఐఆర్‌సీ 35–2015) నిబంధనలకు తిలోదకాలిచ్చి థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను స్పీడ్ బ్రేకర్స్ మాదిరి మందం ఎక్కువ ఉండేలా అధికారులు ఏర్పాటుచేయడం కూడా మరో కారణమనే చర్చ జరుగుతోంది. ఐఆర్‌ఎస్ నిబంధనల ప్రకారం.. థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను ఏదైనా జంక్షన్ లేదా వంపులు వచ్చే సందర్భాల్లో రోడ్లకు అడ్డంగా వేయాలి. రోడ్ల మధ్యలో, అంచుల వద్ద ఆఫ్ రోడ్‌లో వెళ్లేటప్పుడు డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. అలాగే, థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ మామూనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనాస్థలిలో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 30 మి.మీల వరకు ఉంది. ఫలితంగా అక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన వినబడుతోంది. ఈ ఆరు లేన్లకు సమీపంలోనే మరో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ ఉంది. వెంటవెంటనే ఉన్న ఈ స్ట్రిప్స్ వల్ల వేగంగా వచ్చే ఆటోలు, కారులు ఒక్కసారిగా వేగం తగ్గించడంతో వెనుక వచ్చే భారీ వాహనాలు వేగం అదుపు తప్పడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీలు ఉంటే అన్నీ వాహనాలు హైవేపై వచ్చే వేగంతో వెళ్లే అవకాశముంటుంది. అతి ఎక్కువ మందం ఉండడం వల్ల ఇక్కడ వాహనాల వేగం తగ్గడం.. దీనికితోడు ఆ పరిసర ప్రాంతాల్లోనే రెండు పెట్రోల్ బంక్‌ల నుంచి వచ్చే వాహనాల వల్ల కూడా హైవేపై వెళ్లే వాహనాల డ్రైవర్లకు ఇబ్బంది కలిగించే అంశంగా మారిందనే చర్చ ప్రభుత్వ విభాగాల్లో జరుగుతోంది. ముఖ్యంగా మామూనూరు వద్ద నిబంధనలకు విరుద్ధంగా సమీపంలో జంక్షన్ లేకున్నా, రోడ్డు కుంగిన ప్రాంతాలు లేకున్నా థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. అదీకాకుండా మందం ఎక్కువతో చేయడం కూడా రోడ్డు ప్రమాదానికి కారణమని తెలుస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, సోమ, మంగళవారం కూడా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగి స్వల్ప గాయాలతో బయటపడ్డారని గుర్తు చేసుకుంటున్నారు. జాతీయ రహదారిపై వేగ నియంత్రణ కోసం లేజర్ స్పీడ్ గన్స్ సంఖ్య పెంచాలి. ప్రమాద స్థలాన్ని వాహనదారులకు తెలిసేలా పవర్ బ్లింకర్స్, సైన్‌బోర్డులు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, సోలార్ స్టెన్స్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

రవాణా శాఖ అధ్యయనంలో తెలిసిన అంశాలు ఏమిటంటే..

- పంథిని శివారులో రోడ్డుకు సమానంగా లేని ఇరుకైన వంతెనను దాటుతుండగా యూరియా బ్యాగుల లోడ్‌తో వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను ట్రక్ డ్రైవర్ ఢీకొట్టాడు. ఇరుకైన వంతెన దగ్గర 20 మీటర్ల స్కిడ్ గుర్తులు కనిపించాయి.
- ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర తన వేగాన్ని తగ్గించే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చే వాహనాల గురించి వెనుక వీక్షణ అద్దాన్ని గమనించాలి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర వేగం తగ్గించే ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు.
- ట్రక్ డ్రైవర్ ఎక్కడ మద్యం సేవించాడు.. అతను ప్రమాద స్థలానికి చేరుకునే వరకు మద్యం సేవించిన తర్వాత ఎంత దూరం ప్రయాణించాడనే అంశం తెలియాల్సి ఉంది. పురపాలక పరిమితులు మినహా జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు నిషేధించబడ్డాయి.
- మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో మినహా జాతీయ రహదారులపై ప్యాసింజర్ ఆటోలను అనుమతించరు.

వేసవికి సన్నద్ధం కావాలి

- ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్ సంబంధ సమస్యలు నివారించేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వేసవి కాలానికి అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 16 సర్కిళ్లకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. నేడు (బుధవారం) సర్కిళ్లలో జరిగే సమావేశంలో నోడల్ ఆఫీసర్లు పాల్గొని రూపొందించిన ప్రణాళిక మేరకు పనులు జరిగాయా లేదా అని సమీక్షించాలన్నారు. ఓవర్ లోడ్ ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, అవసరమున్న చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సర్వీస్‌లో భాగమైన జిల్లా ఆస్పత్రులు, ఇతర సర్వీసులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ల వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు రాజుచౌహన్, బీకం సింగ్, అశోక్, కె.ఎన్. గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో రోడ్డు ప్రమాదం

- హసన్‌పర్తి వాసి మృతి
- మృతుడు నౌకదళంలో అధికారి



వంశీకృష్ణ (ఫైల్)


హసన్‌పర్తి: గుజరాత్ రాష్ట్రం పోరుబందర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హసన్‌పర్తికి చెందిన నేవి అధికారి మృతి చెందారు. హసన్‌పర్తికి చెందిన ఆకుల రాజేందర్ కుమారుడు వంశీకృష్ణ (28) గుజరాత్‌లోనౌకదళంలో (ప్రధాన యాంత్రిక్)గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో వంశీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రవళి, ఏడాదిన్న కూతురు ఉంది.

నేడు మృతదేహం రాక..

వంశీకృష్ణ మృతదేహం బుధవారం ఉదయం అహ్మదాబాద్ నుంచి విమానంలో హైదరాబాద్‌కు చేరుకుంటుందని కుటుంబసభ్యులు చెప్పారు. ఇదే రోజు రాత్రి అంత్యక్రియలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

రూ. 3 లక్షల చెల్లిస్తే జాబ్ ఇప్పిస్తా..

- మొదట రూ. 10 వేలు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయండి.. జాబ్ రిజ్వర్ చేస్తాం
- ఎన్‌హెచ్‌ఎం అధికారులమంటూ అభ్యర్థులకు ఫోన్ కాల్స్



ఎంజీఎం : రూ. 3 లక్షల చెల్లిస్తే వైద్యారోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశావాహ అభ్యర్థుల ఫోన్ నంబర్‌లు సేకరించిన దళారులు.. ఎన్‌హెచ్‌ఎం అధికారుల పేరుతో వసూళ్ల దందాకు దిగుతున్నారు. కొన్ని నెలల క్రితం ఉద్యోగాల కోసం రాసిన పరీక్షలను ఆధారం చేసుకుని అభ్యర్థుల ఫోన్ నంబర్లు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం హనుమకొండ జీఎంహెచ్‌లో పనిచేసే ఓ ఉద్యోగికి 'మీరు రాసిన పరీక్షలో 74 మార్కులు వచ్చాయి..సెలెక్ట్ కాలేదు.. కానీ.. నేను సెలక్ట్ అయ్యేటట్టు చేస్తా.. ముందు మా అకౌంట్‌కు రూ. 10 వేలు పంపించండి.. ఆ డబ్బులు కూడా ఎలా మా అకౌంట్‌కు పంపించాలో మీరు మీ అకౌంట్‌లో డబ్బులు జమ చేసుకున్నాక చెబుతా.. రూ. 10 వేలు మా అకౌంట్‌కు పంపించగానే మీ జాబ్ లాక్ చేస్తాం.. ఇది ఇన్‌సైడ్ కాల్.. ఎవరికీ చెప్పొద్దు. చెబితే మీకు నష్టమే.. మాకూ నష్టమే.. మీ ప్రావిజనల్ లిస్టు తయారు చేసి మెరిట్ లిస్టులో మీ పేరు వచ్చేలా చేస్తాం. అనంతరం ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యాక మాకు మిగతా 2.90 లక్షలు చెల్లించాలి.. మీకు మరో గంటలో ఫోన్ చేస్తా' అని సదరు ఉద్యోగికి 9883550117 అనే నంబర్ ద్వారా ఫోన్ వచ్చింది. ఇదే నంబర్‌తో మరో గంటకు ఫోన్ చేసి అకౌంట్‌లో డబ్బు జమ చేసుకున్నారా మా సార్‌కు మీతో మాట్లాడారని చెప్పారు.. అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయండి.. మీ జాబ్ లాక్‌చేశామని తిరిగి గంట తరువాత మరో ఫోన్ కాల్ చేస్తామన్నారు. ఇలా ఒకరిద్దరికి కాదు.. పరీక్ష రాసిన వందలాది మందికి దళారులు కాల్స్ చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే, ఎన్‌హెచ్‌ఎం అధికారుల మంటూ వస్తున్న ఫోన్ కాల్స్‌తో ఉద్యోగులు కూడా అయోమయానికి గురవుతున్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న చిరంజీవులు

హన్మకొండ : బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కొంగ వీరస్వామిని నియమించారు. మంగళవారం హైదరాబాద్ జరిగిన కార్యక్రమంలో వీరస్వామిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు నియామక పత్రాన్ని అందించారు. జిల్లాలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరంను పటిష్టం చేయడంతో పాటు హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. బాధ్యతలు అప్పగించిన బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా.. అధికారులకు సూచించారు. కమిషనరేట్ పోలీసు అధికారులతో సీపీ మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్, డివిజనల్, జోన్ల వారీగా పెండింగ్ కేసుల్లోని నిందితుల అరెస్ట్, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల చర్చించారు. నేరాల కట్టడికి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో ముందుకు వెళ్లాలని, మహిళలకు సంబంధించిన కేసులపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. పెండింగ్, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేయాలని, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలన్నారు. తప్పుడు కేసు నమోదు చేయొద్దని, పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతిభద్రతలు అదుపు తప్పుతాయని వివరించారు. రౌడీ షీటర్ల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, ఏఎస్పీ చేతన్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పోలీస్ జట్లు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న వరంగల్ కమిషనరేట్ జట్టు



యాదాద్రి జోన్ జట్టు



కాళేశ్వరం జోన్ జట్టు



భద్రాద్రి జోన్ జట్టు

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాష్ట్రస్థాయి 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభమైంది. వివిధ జోన్ల నుంచి 2,380మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని పలుజోన్లు, వరంగల్ కమిషనరేట్ జట్టు పాల్గొన్నాయి. ముందుగా ఆయా జట్లు మార్చ్‌ఫాస్ట్ చేశాయి. - కరీంనగర్

ఆన్‌లైన్ మోసం..

- ఉద్యోగం కోసం రూ.2.50 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

నెల్లికుదురు: ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఉద్యోగ ప్రకటన చూసి రూ.2.50 లక్షలు చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుది. బాధితుడు కాటమల్ల రాజు కథనం ప్రకారం.. సంవత్సరం క్రితం ఆన్‌లైన్ యాప్‌లో ప్రకటన చూసిన రాజు.. ఉద్యోగం కోసం సంస్థకు రూ.2.50 లక్షలు చెల్లించాడు. అనంతరం ఉద్యోగం కోసం సంస్థకు కొన్ని రోజులుగా ఫోన్ చేస్తున్నాడు. అయితే నిర్వాహకులు స్పందించడం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజు.. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

విద్యారణ్యపురి : తాను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనను గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరునెలలుగా ఈ–కుబేర్‌లోపెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా సంపూర్ణ వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంకా మిగిలిన 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి, జనరల్ సెక్రటరీ సదానందగౌడ్, టీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చెన్నయ్య,ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, బీసీటీఏ అధ్యక్షుడు కృష్ణుడు, బీసీటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పెంట అంజయ్య, ప్రధాన కార్యదర్శి దానయ్య, టీజీహెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జి. హేమచంద్ర, ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య మాట్లాడారు. సమావేశంలో ఎస్‌టీయూ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, మధులిమాయే, వేమునూరు రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

తెలంగాణకు చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

హన్మకొండ: తెలంగాణకు చివరి ఓసీ సీఎం రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్‌లోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2028లో ముఖ్యమంత్రి పీఠం బీసీలదేనన్నారు. ఫిబ్రవరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలో జరిగే బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి నీలారపు రాజేందర్, నాయకులు నాగెల్లి సదానందం, పి.సత్యనారాయణ, రంగు సత్యనారాయణ, నాగబెల్లి ప్రసాద్‌తో పాటు విద్యుత్ బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఈజీఎస్ ఈసీ దుర్మరణం

- ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఘటన



జగదీశ్ (ఫైల్)

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న కోరాటి జగదీశ్ (41) రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఆలేరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన జగదీశ్ బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎస్ఆర్‌ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ హైదరాబాద్ నుంచి రైలులో ఆలేరు వరకు వచ్చి అక్కడి నుంచి బైక్‌పై బచ్చన్నపేటకు వస్తాడు. ఈ క్రమంలో సోమవారం విధులు ముగించుకుని బైక్‌పై ఆలేరు వెళ్లి అక్కడి రైల్వేస్టేషన్‌లో పార్క్ చేశారు. అనంతరం రైలు ఎక్కడానికి పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, ఏపీఓ కృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జగదీశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



రాజు మృతదేహం

ఎల్కతుర్తి : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీతకార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొక్కిస రాజు(35) రోజుమాదిరిగానే కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. కల్లు దింపుతున్న క్రమంలో మోకు జారీ చెట్టుపై నుంచి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న టీచర్లపై ఫిర్యాదు?

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ తల్లి దండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలి సింది. విద్యార్థినులతో కొంతమంది ఉపాధ్యాయుల ప్రవర్తన సరిగా లేదని యువకులు, తల్లిదండ్రులు హెచ్‌ఎంతో గొడవ పడ్డారని సమాచారం. అంతేకాకుండా సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కాజీపేట మీదుగా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : మహా కుంభమేళా యాత్రీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు అదనపు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఫిబ్రవరి 5వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (070 79) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుకుంటుంది. ఫిబ్రవరి 7వ తేదీన దానాపూర్– చర్లపల్లి (07080) ఎక్స్‌ప్రెస్ 8వ తేదీన కాజీపేటకు రాత్రి 21.45 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 7వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07077) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 9వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ 10వ తేదీన 21.45 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగ్‌పూర్, ఇటార్సీ, పిపర్యా, జబల్‌పూర్, కట్నీ, సంత, మణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, చోకి, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ, బాక్సర్, అరా స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.